నేడు సోషల్ స్టార్టప్ ఇంపల్స్

కీసర: సోషల్ ఎంటర్ ప్రెన్యూవర్‌షిప్(ఎస్ఈ)ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) తెలంగాణ సహకారం, బాల వికాససెంటర్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిల్ బిజినెస్ ఆధ్వర్యంలో సామాజిక వ్యాపార సమ్మిట్ ఇంపల్స్ సదస్సును శనివారం ఉదయం 10 గంటలకు రాంపల్లిదాయరలోని బాలవికాస సెంటర్ ఫర్ సోషల్ అండ్ రెస్పాన్సిబిల్ బిజినెస్(సిఎస్ఆర్‌బి)ప్రాంగణంలో సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సదస్సును ఏర్పాటు చేయడం జరుగుతుందని బాల వికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బాలవికాస వ్యవస్థాపకురాలు బాల తెరిసా జింగ్రాస్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి జయేష్‌రంజన్, అటల్ ఇన్నోవేషన్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ చింతన్‌వైష్ణవ్ తదితరులు హాజరవుతారని అన్నారు.

గాయత్రి పూజల్లో బీజేపీ నాయకులు


పూజల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఒరిస్సా కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాయత్రి పూజల్లో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్ రెడ్డి, కౌన్సిలర్ సరస్వతి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌ముదిరాజ్, నాయకులు కావేరి శ్రీధర్, నవీన్, కిషన్ తదితరులు పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు.

ఉద్యోగులకు ఉత్తమ పురస్కారాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: విధుల నిర్వహణలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన 117 మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్ ప్రశంసాపత్రాలను అందజేశారు. 13మంది జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ఉన్నారు. విజయకుమారి(విద్యాశాఖ), దేవసహయం(జెడ్పీ సీఈఓ), పద్మజారాణి(డీఆర్‌డీఏ), కిషన్(ఆర్టీఏ), రాజేందర్(సివిల్ సప్లై మేనేజర్), విజయలక్ష్మీ(డీఎస్ఓ), కృష్ణారెడ్డి(సంక్షేమ శాఖ), వినోద్‌కుమార్(ఎస్సీ శాఖ), నర్సింహ(డీటీఓ), శ్రీనివాసమూర్తి(డీసీఓ), వంశీమోహన్(రెవెన్యూ), మోహన్‌రావు(ప్రణాళిక శాఖ), ఖాసీం(మైనార్టీ శాఖ), రాంమోహన్(ఏఓ), రాజేశ్వర్‌రెడ్డి(ఎన్నికల విభాగం), తదితరులకు ఉత్తమ పురస్కారాలను కలెక్టర్ అందజేశారు.

విద్యార్థులకు ప్రశంసలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు శుక్రవారం కలెక్టరేట్ మైదానంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల అనంతరం విద్యార్థులను కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డి, డీఆర్‌ఏ హరిప్రియ, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి అభినందించడంతో పాటు జ్ఞాపిక అందజేశారు.

నూతన ఆవిష్కరణలు రావాలి

ఘట్‌కేసర్: సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి పరిష్కరించే నూతన ఆవిష్కరణలు రావాలని అనురాగ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం 'ప్రాజెక్ట్ ఎక్స్‌పో'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ మానవ జీవితాన్ని సులభతరం చేస్తుందని, ఇది మానవ అభ్యున్నతితో పాటు డబ్బు, సమయాన్ని ఆదా చేస్తుందన్నారు. విద్యార్థులు తయారు చేసిన విద్యుత్ వాహనం, స్మార్ట్ టాయిలెట్లు, విండోస్ ఆపరేటింగ్ సిస్టం, సోలార్ స్మార్ట్ డస్ట్‌బిన్ తదితర నూతన ఆవిష్కరణలను పరిశీలించారు.

బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ సుప్రభాత్ హోటల్‌లో ఎమ్మార్పీఎస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ హాజరై మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని, కమిటీలతో కాలయాపన చేస్తే బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామన్నారు. ఈ నెల 29న సుందరయ్య విజ్ఞాన భవనంలో జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగారం బాబు, పులిజాల గెలువన్న, పీఎస్.లక్ష్మీ, జ్యోతి, సత్యనారాయణ, యాదగిరి, అంజి, నరేష్, అమృత పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్య కిన్నెర సంస్థ నాట్య గురువులు డాక్టర్ మద్దాలి ఉష గాయిత్రీ శిష్య బృందం స్వేచ్ఛా భారతి నృత్య రూపకాన్ని ప్రదర్శించి మెప్పించారు. బ్రిటీషర్లను తరిమికొట్టి మన దేశానికి సాధించి పెట్టిన ఘన స్వాతంత్ర్య పోరాట ఘట్టాలను కళాకారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కళాకారులు వాసవి, కుమారి, నీరజ, ఆశ్రిత, దీపికా, లక్ష్మీ వాత్సల్య, సహస్ర, దీక్షిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని ర్యాలీ

కుషాయిగూడ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ హక్కులకు భంగం కలుగుతోందని, ఫెడరల్ వ్యవస్థను నాశనం చేస్తూ ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, అధ్యక్షులు అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్ అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా కాప్రా సైనిక్‌పురి జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి ఈసీఐఎల్ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండతిమ్మాపూర్‌కు చెందిన రాజిపేట శ్రీనాథ్(31), అదే గ్రామానికి చెందిన యాదగిరితో కలిసి పని నిమిత్తం మేడ్చల్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చి ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యారు. 44వ జాతీయ రహదారిపై వెళ్తుండగా ఐడీబీఐ బ్యాంకు సమీపంలో వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. దీంతో బైక్ వెనకాల కూర్చున శ్రీనాథ్ కిందపడగా అతడిపై నుంచి లారీ వెళ్లింది. శ్రీనాథ్ అక్కడికక్కడే మృతి చెందగా యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్, ఎంపీపీ తదితరులు


ఎమ్మార్‌సీతా కళాశాలలో గణతంత్ర వేడుకల్లో ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు


గుండ్లపోచంపల్లి చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు


గుండ్లపోచంపల్లిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి తదితరులు

మువ్వన్నెల రెపరెపలు

అన్ని మున్సిపాలిటీలతో పాటు మండలాలు, గ్రామాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో జెండా ఆవిష్కరణ చేశారు. ఆయా రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్కూళ్లలో పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు సందడి చేశారు. – మేడ్చల్‌జోన్ బృందం


మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో మంత్రి మల్లారెడ్డి



మునీరాబాద్‌లోని ఎస్‌కేఎమ్ పాఠశాలలో..


సెయింట్ పీటర్స్ కళాశాలలో చైర్మన్ బాలరెడ్డి, సెక్రటరి


ఎస్‌కేఎమ్ పాఠశాల విద్యార్థులు


నాగారం మున్సిపాలిటీలో..


దమ్మాయిగూడ మున్సిపాలిటీలో..


కీసర ఎంపీడీఓ కార్యాలయం వద్ద..


అన్నోజిగూడ తులిప్స్ గ్రాండ్ వద్ద నిర్వాహకులు


అనురాగ్ యూనివర్సిటీలో..


ఘనాపూర్‌లో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు


పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ వేమనరెడ్డి, చైర్మన్ కొండల్‌రెడ్డి


ఎన్ఎఫ్‌సీ నగర్‌లో చైర్ పర్సన్ పావనీజంగయ్య తదితరులు


జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద కమిషనర్ రామలింగం, మేయర్ కావ్య, కార్పొరేటర్లు


చెన్నాపురం శ్రీకృష్ణపురి కాలనీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్


సీఆర్‌పీఎఫ్ పాఠశాలలో డీఐజీపీ అనిల్‌మింజ్, ప్రిన్సిపల్ అపర్ణ


సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ రైట్స్ ఆధ్వర్యంలో..


ఘట్‌కేసర్ పీఎస్ ఆవరణలో సీఐ మహేందర్‌రెడ్డి


జాతీయ జెండా రూపంలో ఎల్లంపేట్ శివుడు

మేడ్చల్‌ను ప్రగతి పథంలో నిలుపుదాం

- శివారుల్లో పారిశ్రామిక రంగానికి పెద్దపీట
- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ గౌతమ్
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్
- రాజీవ్ ఆరోగ్యశ్రీతో రూ.10 లక్షలతో ఉచిత వైద్యం
- అల్వాల్‌లో 1200 పడకల టీమ్స్ ఆసుపత్రి
- రూ.23 కోట్లతో ఘట్‌కేసర్ బ్రిడ్జి పనులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: అన్ని రంగాల్లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాను ప్రగతి పథంలో నిలుపుదామని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఇప్పటికే నగరానికి సమాంతరంగా అభివృద్ధి పథంలో ఉన్నామని, మరింత ప్రగతి దిశలో పయనించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం, పరస్పర సహకారంతో ముందుకెళ్లాలన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ ప్రసంగిస్తూ.. జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనుందని పేర్కొన్నారు.

◆ అభయహస్తం పథకంలో భాగంగా ఆరు గ్యారంటీల కింద జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, బస్తీల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ప్రజాపాలన మొదటి విడతలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకం కింద ప్రజల వద్ద నుంచి స్వీకరించిన దరఖాస్తులను కంప్యూటరీకరణ చేసి, పథకాల వారిగా ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు.

◆ ప్రతి వ్యక్తి ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టడంతో పాటు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంలో భాగంగా జిల్లాలో 1.20కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించినట్లు పేర్కొన్నారు.

◆ పారిశ్రామిక రంగానికి పెద్దపీట..

జిల్లాలో రూ.15,805 కోట్ల పెట్టుబడులతో 12,774 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలను ఏర్పాటు చేసి 2,33,88 మందికి ఉపాధి కల్పించినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. నూతనంగా పరిశ్రమలు స్థాపనకు ముందుకు వచ్చిన అన్ని వర్గాల పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, పన్ను, విద్యుత్ చార్జీల్లో రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 'టి–ఐడియా పథకం కింద 3,825 మంది పారిశ్రామికవేత్తలకు రూ.450.52 కోట్ల రాయితీ ఇచ్చామన్నారు. 'టీ ప్రైడ్ పథకం ' కింద 2,731 పారిశ్రామికవేత్తలకు రూ.142.50 కోట్ల రాయితీలు మంజూరు చేశామన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద సూక్ష్మ పరిశ్రమలు స్థాపనకు బ్యాంకు రుణంతో కూడిన సబ్సిడీ ఇస్తున్నామన్నారు.

◆ అల్వాల్‌లో 1200 పడకల్లో టిమ్స్ ఆస్పత్రి

అల్వాల్‌లో 1200 పడకల్లో టిమ్స్ ఆస్పత్రికి నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. మేడ్చల్ పట్టణంలో 100 పడకల మాతా శిశు సంరక్షణ కేంద్రం, ఆస్పత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కూకట్‌పల్లిలో 100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందన్నారు. జిల్లాకు కొత్తగా 200 పడకల ప్రభుత్వ వైద్యశాలతో సహా నాలుగు కొత్త పట్టణ ఆరోగ్య కేంద్రాలు మంజూరైనట్లు చెప్పారు.

◆ రూ.23 కోట్లతో ఘట్‌కేసర్ బ్రిడ్జి పనులు

రూ.23 కోట్ల అంచనా వ్యయంతో ఘట్‌కేసర్ రైల్వే గేటు వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ ద్వారా 39,593 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు కాగా, 30,733 ఇళ్లు పూర్తయ్యాయి. ఇందులో 29 వేల ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించినట్లు తెలిపారు. మేడ్చల్ డీసీపీ నిఖితపంత్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఐ మహేందర్‌రెడ్డికి ఉత్తమ సేవా పతకం



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్‌రెడ్డికి జిల్లాలో ఉత్తమ సేవా పథకం అవార్డు లభించింది. మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ గౌతమ్ ఆయనకు అవార్డు అందజేశారు. 2023 సార్వత్రిక ఎన్నికల్లో ఘట్‌కేసర్, ఐటీ కారిడార్ పోచారం పీఎస్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మెరుగైన సేవలు అందించినందుకు అవార్డు వరించింది.



మేడ్చల్ సీఐకి మెరిటోరియస్ అవార్డు

మేడ్చల్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉత్తమ సేవలు అందించిన మేడ్చల్ సీఐ నర్సింహారెడ్డికి మెరిటోరియస్ అవార్డు దక్కింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలు శాఖల నుంచి ఉత్తమ అధికారులను ఎంపిక చేసిన జిల్లా యంత్రాంగం ఈ మేరకు 2023 ఏడాదికి మెరిటోరియస్ అవార్డుకు మేడ్చల్ సీఐని ఎంపిక చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ గౌతమ్ చేతులమీదుగా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారికి ఉత్తమ అవార్డు

మేడ్చల్: విధి నిర్వహణలో జిల్లా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారికి ఉత్తమ అధికారి అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ నిర్వహించిన సంబరాల్లో జిల్లా కలెక్టర్ గౌతమ్ జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారికి కిషన్‌కు ప్రశంసాపత్రం అందజేశారు.

